క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి

భువనగిరి రూరల్ : రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యవసరం ఉంటే తప్పా ప్రయాణాలు చేయొద్దని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఎలాంటి సంఘటనలు జరుగకుండా ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

గుండాల : భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జలకుమారీ అన్నారు. ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రజలు అత్యవసరమైతే తప్పా బయటకు రావొద్దని సూచించారు.

వలిగొండ : భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మహేందర్ లాల్ తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు వెళ్లాలన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ప్రధానోపాధ్యాయురాలు మంజులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్, డీఈఓ

చౌటుప్పల్ : సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని తెలంగాణ మున్సిపల్ చైర్మన్స్ చాంబర్ రాష్ట్ర చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, జిల్లా విద్యాధికారి కానుగుల నర్సింహ అన్నారు. పట్టణ కేంద్రంలోని ట్రినిటీ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థలో విధులు నిర్వహిస్తున్న 200మంది ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాల చైర్మన్ కేవీబీ.కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి, ట్రినిటీ డైరెక్టర్ డాక్టర్ ఉజ్జిని మంజుల, యానాల ప్రభాకర్‌రెడ్డి, వెన్‌రెడ్డి సంధ్య పాల్గొన్నారు.

జిట్టా బాలకృష్ణా రెడ్డి కోలుకోవాలని పాదయాత్ర

భువనగిరి : తెలంగాణ ఉద్యమ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆయన అభిమానులు ఆదివారం స్థానిక శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం నుంచి యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం వరకు పాదయాత్ర ప్రారంభించారు. అంతకు ముందు రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాదయాత్రలో తోటకూరి వెంకటేశ్ యాదవ్, వల్లందాసు ఆదినారాయణ, బెల్లి చంద్రశేఖర్, జనగాం పాండు,ఏవీ కిరణ్, శ్రీనివాస్‌రెడ్డి,చింతల లక్ష్మీనారాయణ, శంకర్,సత్తిరెడ్డి, కస్తూరి పాండు, రత్నపురం శ్రీనివాస్, మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

రామన్నపేట: మండలకేంద్రంలోని దారుల్ ఉలూం హుస్సేనియా(మదర్సా) పాఠశాలకు చెందిన విద్యార్థి అదృశ్యమైన సంఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేటకు చెందిన మహ్మద్ మొయినుద్దిన్‌ఖాన్ (20) గత నెల 18న రామన్నపేట మదర్సాలో చేరాడు. 30న మధ్యాహ్నం మదర్సా టీచర్ మహ్మద్ సయ్యద్ అన్వర్ హాస్పిటల్‌కు వెళ్లి నమాజ్ సమయానికి తిరిగివచ్చి చూసే సరికి మొయినుద్దిన్ కనిపించ లేదు. తల్లితండ్రులకు సమాచారం అందించి చుట్టుపక్కల వెతికారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మదర్సా నుంచి బయటకి వెళ్లేటప్పుడు గోదుమరంగు లాల్చీ, తెల్లని పైజామా ధరించాడు. టీచర్ సయ్యద్ అన్వర్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పి.మల్లయ్య తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

బీబీనగర్: బీబీనగర్-ఘట్‌కేసర్ రైల్వే మార్గంలో రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి జరిగింది. భువనగిరి జీఆర్పీ ఇన్‌చార్జి కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 42 సంవత్సరాలు కలిగిన వ్యక్తి బీబీనగర్-ఘట్‌కేసర్ రైల్వే మార్గంలో మైలురాయి 223/23-25 దిగువ లైన్ వద్ద గుర్తుతెలియని రైలు ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు గమనించి 108 వాహనంలో అతడిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాల కోసం 9848222169 ను సంప్రదించాలన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో టీవీ, కూలర్ దగ్ధం

చౌటుప్పల్ రూరల్ : ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇంట్లోని కూలర్, టీవీ దగ్ధమైన సంఘటన చౌటుప్పల్ మండలంలోని ఆరెగూడెం గ్రామంలో జరిగింది. వివరాల ప్రకారం.. గ్రామానికి గుండెబోయిన బాలకృష్ణ ఇంట్లో విద్యుత్ షాట్‌సర్క్యూట్ అయ్యింది. దీంతో ఇంట్లో ఉన్న టీవీ, కూలర్, ఇతర సామాగ్రి దగ్ధమయ్యాయి.

బెల్టు షాపుల్లో తనిఖీలు

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని పలు బెల్టు షాపుల్లో ఆదివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణ కేంద్రానికి చెందిన వంకాయలపాటి రామకృష్ణకు చెందిన కిరాణం దుకాణంలో తనిఖీ చేసి 6.5లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

పొంగిన వాగులు.. నిండిన చెరువులు

- ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం
- ఈదురు గాలులకు కూలిన చెట్లు, విరిగిన విద్యుత్ స్తంభాలు
- వాగుల వద్ద రహదారులు మూసివేసిన అధికారులు
- పలుచోట్ల రాకపోకలకు అంతరాయం



భూదాన్‌పోచంపల్లి : జూలూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ



అడ్డగూడూరు : అలుగుపోస్తున్న ధర్మారం చెరువు



అడ్డగూడూరు : పత్తి చేనులో నిలిచిన వర్షపు నీరు



వలిగొండ : ప్రొద్దటూరు వద్ద కల్వర్టు పైనుంచి ప్రవహిస్తున్న మూసీ



ఆలేరురూరల్ : సిల్కనగర్ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

భువనగిరి : భువనగిరి పట్టణంలో ఆదివారం ఎడతెరిపి లేకుండా ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈదురు గాలులకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో చెట్లు కూలాయి. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో వరంగల్- హైదరాబాద్ ప్రధాన రహదారిపై చెట్టు కూలింది. దీంతో కొద్ది సేపు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని వార్డులో కిటికీల ద్వారా వర్షం లోపల పడడంతో బెడ్స్ తడిసి రోగులు ఇబ్బందులు పడ్డారు.

భువనగిరిటౌన్ : మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రెండు పురాతన ఇళ్లను ఆదివారం మున్సిపాలిటీ అధికారులు కూల్చి వేశారు. అదేవిధంగా నాలుగు చోట్ల రోడ్లపై పడిన పెద్ద చెట్లను తొలగించామని మున్సిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి తెలిపారు.

భువనగిరి రూరల్ : భువనగిరి-చిట్యాల ప్రధాన రహదారిపై అనాజీపురం సమీపంలో రోడ్డుకు అడ్డంగా చెట్టు విరిగిపడింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రయాణికులు కూలిన చెట్టును తొలగించారు. నందనం-నాగిరెడ్డిపల్లి మధ్యలో, అనాజీపురం-రావిపహడ్ కల్వర్టు మీదుగా వరద ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవయ్యాయి.

ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ

వలిగొండ : భారీ వర్షాల కారణంగా మండలంలో మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలోని సంగెం బొల్లేపల్లి గ్రామాల వద్ద భీమలింగ కత్వ వద్ద మూసీ నదిపై ఉన్న లోలేవల్ బ్రిడ్జి పై వరద ప్రవహిస్తుంది. దీంతో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. మండలంలోని ప్రొద్దటూర్, వర్కట్‌పల్లి గ్రామాల మధ్య కల్వర్టు పైనుంచి మూసీ నీరు ప్రవహిస్తుండడంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచి పోయాయి.

పోచంపల్లిలో..

భూదాన్‌పోచంపల్లి : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. పోచంపల్లి చెరువు నిండి అలుగుపోస్తుంది. పట్టణ కేంద్ర పరిధిలోని గాజులకుంట నుంచి దిగువకు భారీగా వరద పోచంపల్లి చెరువులోకి వస్తుండడంతో పద్రె కాలువ సమీపంలో పోచంపల్లి-బీబీనగర్ మెయిన్ రోడ్డు పైనుంచి వరదనీరు ప్రవహిస్తుంది. పిలాయిపల్లి, జూలూరు, పెద్దరావులపల్లి వద్ద మూసీ పరవళ్లు తొక్కుతుంది. జూలూరు వద్ద వీఆర్ఏతో పాటు పోలీస్‌సిబ్బందిని ఉంచి వాహనదారులను అప్రమత్తం చేస్తున్నారు. తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి మూసీ నది వరదను పరిశీలించారు.

బొమ్మలరామారం : మండలంలో ఆదివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. హాజీపూర్-మాచన్‌పల్లి గ్రామాలతో పాటు మునీరాబాద్- బండకాడిపల్లి గ్రామాల వద్ద షామీర్‌పేట వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని పలు వాగులను తహసీల్దార్ శ్రీనివాసరావు పరిశీలించారు. మండల కేంద్రంతో పాటు చీకటిమామిడి రోడ్డుపై చెట్లు కూలిపోయాయి. రెవెన్యూ, పోలీసు అధికారులు కూలిన చెట్లను తొలగించారు. చీకటిమామిడిలో రాజు నాయక్ తన జేసీబీతో రోడ్డుపై పడిన చెట్టును తొలగించారు. మండలంలోని బోయిన్‌పల్లిలో రెండు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

నివాస గృహాల్లోకి చేరిన వరద నీరు

మోత్కూరు : మండలంలో ఆదివారం ఎడతెరిపి లేని వర్షం కురిసింది. దీంతో మండలంలోని దత్తప్పగూడెం గ్రామంలో రోడ్డు వెంట ఉన్న నివాస గృహాల్లోకి వరద నీరు వచ్చి చేరింది. వలిగొండ-తొర్రూరు ప్రధాన జాతీయ రహదారి నిర్మాణంతో దత్తప్పగూడెం గ్రామం వద్ద ఎగువ ప్రాంతమైన జమ్మి చెట్టు కాలనీకి చెందిన గనగాని సాయిలు, గనగాని లక్ష్మయ్య, లింగాల అంజయ్య నివాస గృహాల్లోకి భారీగా వరద నీరు చేరడంతో వారు ఇబ్బందులు పడ్డారు. ఇంట్లోని వస్తువులు తడిసి ముద్దయ్యాయని వాపోయారు. మున్సిపల్ కేంద్రంలోని పురుగుల లింగయ్య ఇంట్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. మండలంలోని పాడిచేడు, నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు గ్రామాల మధ్య మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది.

ఆలేరురూరల్ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో మండలంలోని కొలనుపాక వాగు, బయ్యన్న వాగు, రట్నాలవాగులు పొంగిపొర్లుతున్నాయి. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆలేరు మండలంలో 45.3 సెంటీ మీటర్లు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

బాలికల వసతి గృహంలో కూలిన చెట్లు

యాదగిరిగుట్ట రూరల్: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పట్టణంలోని గురుకుల బాలికల వసతి గృహంలో రెండు చెట్లు విరిగిపడ్డాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధ ఆదివారం హాస్టల్‌లో కూలిన చెట్లను, సిబ్బందితో తొలగించారు. పట్టణంలోని ఎస్సీకాలనీ నుంచి వంగపల్లి చెరువులోనికి వెళ్తున్న వరద కాలువ ఉధృతిని, గంగసానిపల్లి నుంచి గుట్ట నల్లచెరువులోనికి వచ్చే ఫీడర్ ఛానెల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బూడిద సురేందర్, బిట్టు సరోజ హరీష్, వార్డెన్ సోని పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): మండలంలో ఆదివారం ఓ మోస్తారు వర్షం కురుసింది. పలు గ్రామాల్లో ఈదురుగాలులు వీయడంతో చెట్లు కూలి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. ఎస్ఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో పోలీసులు కూలిన చెట్లను తొలగించారు. మొరిపిరాల వద్ద ప్రవహిస్తున్న బిక్కేరు వాగును తహసీల్దార్ రవికుమార్ పరిశీలించారు.

చౌటుప్పల్ : మండలంలో ఆదివారం మధ్యాహ్నం వరకు ఓ మోస్తారు వర్షం కురిసింది. వర్షం కారణంగా రోడ్లు బురదమయంగా మారాయి.

రామన్నపేట : మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న ఎండతెరిపి లేని వర్షానికి జనజీవనం స్తంభించింది. మండలకేంద్రంలో 6.8 సెం.మీ, వెల్లంకిలో 5.4సెం.మీ వర్షపాతం నమోదైంది. మండలకేంద్రంలోని బీసీహాస్టల్ సమీపంలో విద్యుత్ స్తంబం నేలకొరిగి ఓ ఇంటి మీద పడింది. వెల్లంకిలో సుంకెనపల్లికి వెళ్లేదారిలో చెట్టు కూలి రాకపోకలకు అంతరాయం కలిగింది. సూరారం గ్రామంలోని శాలిగౌరారం కాలువను ఆనుకుని ఉన్న కాలనీకి వరదనీరు పెరగడంతో ఐబీ అధికారులు పల్లివాడ వద్ద తలుపులను మూసివేశారు. లక్ష్మాపురం-వేములకొండ గ్రామాల మధ్య బ్రిడ్జిని తాకుతూ మూసీ ఉధృతంగా ప్రవహిస్తుంది. రామన్నపేట ఎస్ఐ పి.మల్లయ్య ఆధ్వర్యంలో వాగు వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలకేంద్రంలో విద్యుత్ స్తంబం విరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్ అధికారులు వర్షంలో రెండుగంటల పాటు శ్రమించి విద్యుత్‌ను పునరుద్ధరించారు. విద్యుత్ పునరుద్ధరణకు శ్రమించిన ఏఈ నర్సింహ లైన్‌మెన్ వేణు, సురేష్, యాదయ్య, స్వామి, మధును పలువురు అభినందించారు.

అడ్డగూడూరు : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఆదివారం ఎడతెరిపి లేకుండా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పత్తి చేన్లలో వర్షం నీరు నిలిచింది. ఈదురు గాలులకు చౌల్లరామారం, అడూగుడూరు గ్రామాల్లో చెట్లు కూలాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ధర్మారం, అజీంపేట గ్రామాల్లోని చెరువులు అలుగుపోశాయి. చిర్రగూడూరు ప్రధాన రోడ్డుపై యాదలవాగు రోడ్డు పైనుంచి వరద ప్రవహిస్తుండడంతో పోలీసులు వాగువద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. వలిగొండ-తొర్రూర్ మార్గంలో రాకపోకలకు అంతరాయం కలిగింది.

మోటకొండూర్: మండల వ్యాప్తంగా ఆదివారం కురిసిన వర్షానికి బిక్కేరు వాగు ప్రవహిస్తుంది. మండంలోని పలు గ్రామాలను తహసీల్దార్ శాంతిలాల్, ఏపీఓ చంద్రశేఖర్, ఆర్ఐ నరేష్‌లు పర్యటించారు. కొండాపూరం-కాల్వపల్లి బీటీ రోడ్డుపై భారీకేడ్లు ఏర్పాటు చేయించారు.

రాజాపేట : మండలంలో ఆదివారం కురిసిన వర్షంతో పారుపల్లి చిన్నవాగు కల్వర్టుపై నుంచి వరద నీరు పారింది. వాగును తహసీల్దార్ దామోదర్, ఎంపీడీఓ నాగవేణిలు పరిశీలించారు.



భువనగిరి రైల్వే స్టేషన్ సమీపంలో కూలిన చెట్టు



బొమ్మలరామారం : రోడ్డుపై కూలిన చెట్టును తొలగిస్తున్న పోలీసులు



రామన్నపేటలో ఓ ఇంటిపై ఆవరణలో ఒరిగిన విద్యుత్‌స్తంభం



చౌటుప్పల్ : సర్వీస్‌రోడ్‌పై నిలిచిన వర్షపునీరు



మోటకొండూర్: కాల్వపల్లి రోడ్డుపై భారీకేడ్లు ఏర్పాటు చేయిస్తున్న తహసీల్దార్ శాంతిలాల్



భువనగిరి రూరల్ : అనాజీపురం రోడ్డుపై విరిగిపడిన చెట్టును తొలగిస్తున్న స్థానికులు



రాజాపేట : పారుపల్లి వద్ద వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ



ఆత్మకూరు(ఎం): మొరిపిరాల వద్ద బిక్కేరు వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ రవికుమార్

వాగుల పరిశీలన

అడ్డగూడూరు : మండలంలోని అడ్డగూడూరు-గోవిందాపురం గ్రామ సమీపంలోని లోలెవల్ బ్రిడ్జిపై ప్రవహిస్తున్న నక్కల వాగును ఆదివారం కలెక్టర్ హనుమంత్ కే. జెండగే పరిశీలించారు. వాగు ఉధృతి కొనసాగే వరకు రాకపోకలను నిలిపి వేయాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉన్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ శంకరయ్య, ఎంపీఓ ప్రేమలత, ఆర్ఐలు శ్రీనివాస్, రాజేష్, పంచాయతీ కార్యదర్శి నరేష్ ఉన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని బొల్లేరు వాగును కలెక్టర్ హనుమంత్ కే. జెండగే ఆదివారం పరిశీలించారు. భారీ వర్షాలు, వరదలను దృష్టిలో పెట్టుకుని ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు.

మోటకొండూర్: మండలంలోని కొండాపూరం సమీపంలో కాల్వపల్లి బీటీ రోడ్డుపై ప్రవహిస్తున్న బిక్కేరు వాగును ఆదివారం కలెక్టర్ హనుమంతు కే జెండగే పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శాంతిలాల్, ఆర్ఐ నరేష్, ఎస్సై ఎస్ పాండు, ఏపీఓ చంద్రశేఖర్, కానిస్టేబుల్స్ కెక్కర్ల మధుగౌడ్, జాన్ రెడ్డి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

బీబీనగర్: మండలంలోని రుద్రవెల్లి - జూలూరు గ్రామాల మధ్యన గల మూసీ నది వరద ఉధృతిని ఆదివారం అదనపు కలెక్టర్ గంగాధర్ పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డిలు ఉన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

భూదాన్‌పోచంపల్లి : భారీ వర్షాలు ఉన్నందున ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని జూలూరు సమీపంలోని మూసీ నదిని ఆయన సందర్శించారు. అనంతరం వివిధశాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. జూలూరు-రుద్రవెల్లి లోలెవల్ బ్రిడ్జి వద్ద, భీమలింగం కాలువ, బ్రాహ్మణపల్లి వద్ద వరదల వల్ల ఇబ్బందులు జరిగే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఆర్థికసాయం అందజేత

మోత్కూరు : అనారోగ్యంతో బాధపడుతున్న మున్సిపల్ కేంద్రంలోని గడి బజార్‌కు చెందిన నిలిగొండ రేణుకను ఆదివారం ఆమె చిన్ననాటి బాల్య మిత్రులు పరామర్శించారు. అనంతరం రూ.7500 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో శ్రీను, సునీల్, యాకూబ్, కృష్ణస్వామి పాల్గొన్నారు.

భువనగిరి రూరల్ : మండలంలో చందుపట్ల గ్రామానికి చెందిన కామునిగూడెం నర్సమ్మ(65) అనారోగ్యంతో మృతిచెందింది. చందుపట్ల పీఏసీఎస్ తరపున రూ.30 వేల ఆర్థికసాయాన్ని ఆదివారం మృతురాలి కుటుంబానికి పీఏసీఎస్ చైర్మన్ మందడి లక్ష్మీనర్సింహ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, మహేందర్, సీఈఓ దంతూరి నర్సింహ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని రాంనగర్‌కు చెందిన నిరుపేద చేనేత కార్మికుడు బేతి మధుసూదన్ కుమారుడు బేతి జగదీశ్ ఎంబీబీఎస్ చదువుతున్నాడు. విద్యార్థికి ఫీజు చెల్లించడానికి ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో టీఆర్ ఫౌండేషన్ చైర్మన్ తడక రమేశ్, తన టీఆర్ ఫౌండేషన్ ద్వారా ఆదివారం రూ. 30వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ యువసేన అధ్యక్షుడు వలందాస్ ప్రవీణ్, చింతకింది దామోదర్, కడవేరు హన్మంతు, భోగ నర్సింహ, కొండ శివ, పుండరీకం, గోపాల్, ధర్మేందర్, మనోహర్, శ్రీకాంత్, సత్యనారాయణ పాల్గొన్నారు.

గోదావరి జలాలు అందించాలి

మోత్కూరు : మూసీకి ప్రత్యామ్నాయంగా గోదావరి జలాలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.డీ.జహంగీర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పాలడుగులో సీపీఎం గ్రామ శాఖ మహా సభను దడిపల్లి ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం, బొల్లు యాదగిరి, వెంకటనర్సు, కొంపెల్లి ముత్తమ్మ, చంద్రయ్య పాల్గొన్నారు.

చేనేత పరిశ్రమను ఆదుకుంటాం : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : చేనేత పరిశ్రమను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అందులో భాగంగానే త్రిఫ్ట్ పథకానికి రూ.90 కోట్లు విడుదల చేసిందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం భూదాన్‌పోచంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అమలవుతున్న చేనేత పథకాలను సమీక్షించి చేనేత కార్మికులకు ఇంకా మెరుగైన పథకాలకు ప్రభుత్వం రూపకల్పన చేస్తుందన్నారు. అదేవిధంగా పోచంపల్లిలోనే ఇండియన్ ఇనిస్టిస్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో చేనేత సంఘం రాష్ట్ర నాయకుడు తడక వెంకటేశం, చేనేత కార్మిక సంఘం అధ్యక్షురాలు మెరుగు శశికళ, టై అండ్ డై అసోషియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, మాజీ అధ్యక్షుడు, అర్బన్‌బ్యాంకు చైర్మన్ తడక రమేశ్, కుడికాల సృజన, నాయకులు పాక మల్లేశ్, మర్రి నర్సింహారెడ్డి, పక్కీరు మల్లారెడ్డి, పడమటి భూపాల్‌రెడ్డి, మెరుగు యతీనందం, కీర్తి సంజీవ, భోగ నర్సింహ, చందు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

భువనగిరి రూరల్ : పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీజీ ఈజేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట టీజీ ఈజేఏసీ ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహదినం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధాన సాధన కోసం దశలవారీగా పోరాడతామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీఓ, టీజీఓ ఉపాధ్యాయ, పెన్షనర్స్ సంఘ నాయకులు డి.భగత్, ఎండీ. ఖదీర్, ముక్కెర్ల యాదయ్య, మెతుకు సైదులు, ఏనుగు చిత్తరంజన్ రెడ్డి, కవిత, లింగా అరుణ, కోమటిరెడ్డి మోహన్ రెడ్డి, రేకల ఆనందం, పెండెం శ్రీను, విజయ్, జ్ఞానప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి

సంస్థాన్ నారాయణపురం: బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనూరు వీరారెడ్డి అన్నారు. ఆదివారం మండలం కేంద్రంలో బీజేపీ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సుర్వి రాజుగౌడ్, భాస్కర్, నరసింహ, వంగరి రఘు, బూస శ్రీనివాస్, నందగిరి జగత్ కుమార్, ఉష్కాగుల గిరిబాబు, వెంకటేష్, ఇంద్రసేనారెడ్డి, వెంకటేష్, మంజునాథ రెడ్డి, గాలయ్య పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల మహోత్సవం



రామన్నపేట : వెల్లంకిలో బోనాలు ఎత్తుకుని వస్తున్న మహిళలు



రాజాపేట : జాల గ్రామంలో..



రామన్నపేట : కొమ్మాయిగూడెంలో..



ఆలేరురూరల్ : బోనాలతో మహిళలు

రామన్నపేట : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పసుపు, కుంకుమలతో అలంకరించిన బోనాలను మహిళలు డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. కొమ్మాయిగూడెంలో మహిళలు పచ్చటి పొలాల మధ్య గట్లమీదుగా బోనాలను తీసుకెళ్లారు.

కొలనుపాకలో..

ఆలేరురూరల్ : మండలంలోని కొలనుపాకలో గౌడ సంఘం ఆధ్వర్యంలో కంఠమహేశ్వర స్వామి బోనాల పండుగను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. డప్పు చప్పుళ్ల శివసత్తుల పూనకాలతో బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా కంఠమహేశ్వర స్వామి ఆలయం వద్దకు వెళ్లి బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళలు దూడల రమాదేవి, ఉమా, రాధా, భారతమ్మ, స్రవంతి పాల్గొన్నారు.

ఆరెగూడెంలో..

చౌటుప్పల్ రూరల్: మండలంలోని ఆరెగూడెం గ్రామంలో ముత్యాలమ్మ బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాల మల్లేష్, మునుగాల తిరుపతిరెడ్డి, జిల్లాల మాసిరెడ్డి, బద్దం కృష్ణ, మారసాల వెంకటేష్, మహిపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఈదమ్మ, బీరప్ప, ముత్యాలమ్మ బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పులతో ఊరేగింపు బోనాలు తీసుకెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రాజాపేట : మండలంలోని జాల, రాజాపేట, రఘునాథపురం, బసంతపురం, చల్లూరు, బేగంపేట గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. డప్పువాయిద్యాలు శివసత్తుల పూనకాల మధ్య మహిళలు బోనాలను ఎత్తుకుని ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవార్ల సమర్పించారు. రఘునాథపురంలో భక్తమర్కండేయ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పద్మశాలీ కులస్తులు పోచమ్మ తల్లికి చీరె సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బోగ వెంకటేశం, పద్మశాలీ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

బొమ్మలరామారం : మండలంలోని నాగినేనిపల్లి, మైలారం, ఫక్కీరుగూడెం, తూంకుంట గ్రామ పరిధిలోని బండకిందిపల్లి గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు.



బొమ్మలరామారం : బండకిందిపల్లిలో ..



బొమ్మలరామారం : ఫక్కీరుగూడెంలో..



చౌటుప్పల్ రూరల్ : ఆరెగూడెంలో..